

వేటూరి సాహితీ పురస్కారానికి
సుద్దాల అశోక్‌తేజ
ఎంపిక
6



గాల్లో కలిసినట్టే!

ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువుకాదని చెబుతున్న భూములివే.. ఎయిర్‌పోర్టు వద్దని ఫ్లెక్సీ

- తుని-అన్నవరం మధ్య విమానాశ్రయ ప్రతిపాదన రద్దు
- ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన పరిస్థితులు లేకపోవడమే కారణం
- ఎయిర్‌పోర్టుకు సానుకూలత అంశాలేవీ లేవని తేల్చేసిన అధికారులు
- భూముల మధ్య రైల్వేలైన్, హైవే,పోలవరం,పుష్కర కాలువలతో ప్రతికూలత
- ఇదే మండలంలో మరికొన్ని భూములు పరిశీలించినా అవీ అననుకూలతే
- తునికి ఆనుకుని ఉన్న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఏర్పాటుకే మొగ్గు
- తుని-అన్నవరంతో పోల్చితే అక్కడ భూముల ధరలు కూడా తక్కువే
- విమానాశ్రయానికి భూములివ్వమంటూ తొండంగి రైతుల ఆందోళనలు
- తాజా నిర్ణయంతో అన్నదాతల్లో తీరనున్న విమానాశ్రయ గుబులు

తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదన గాల్లో కలిసిపోయింది. ఇక్కడ దీని నిర్మాణానికి ఏమాత్రం సానుకూల అంశాలు లేవని అధికారులు తేల్చేశారు. జాతీయ రహదారికి సమీపంలో ఒక్కగ్రామం కూడా తగలకుండా విమానాశ్రయ ఏర్పాటుకు భూములు లేవని నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎయిర్‌పోర్టు ప్రతిపాదన పూర్తిగా ఉపసంహరించుకోవడమే మేలనే నిర్ణయం ఖరారైపోయింది. అటు రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం జిల్లా నుంచి గంటన్నర వ్యవధిలో చేరుకునే అవకాశం ఉన్నందున అసలు ఈ ప్రాంతంలో వేరే ఎయిర్‌పోర్టు అక్కర్లేదని అధికారులు ప్రభుత్వం దృష్టికి తాజాగా తీసుకువెళ్లారు. దీంతో తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు ప్రతిపాదన రద్దయినట్టే. మరోపక్క తునికి ఆనుకుని అనకాపల్లి జిల్లా పరిధిలోకి వచ్చే పాయకరావుపేటలో దీని ఏర్పాటుకు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతో అక్కడ విమానాశ్రయం ఏర్పాటయ్యే అవకాశం ఉంది. కాగా విమానాశ్రయం కోసం భూములు ఇవ్వడానికి నిరాకరిస్తూ తొండంగి మండలం రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తాజా నిర్ణయం అన్నదాతలకు ఊరటనిచ్చినట్టయింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొత్తగా విమానాశ్రయాలు నిర్మించి తద్వారా పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం పరిశ్రమలకు సమీపంలో కొత్త ఎయిర్‌పోర్టులు కట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇవి సమీప ప్రజలకు సైతం ఉపయోగపడతాయని అంచనా వేస్తోంది. అందులోభాగంగా తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు నిర్మిస్తే పారిశ్రామిక అవసరాలు, ప్రజలకు అనువుగా ఉంటుందని మూడు నెలల కిందట ఓ అంచనాకు వచ్చింది. పైగా ప్రతిపాదిత ప్రాంతంలో కాకినాడ సెజ్, అందులో నిర్మాణమవుతున్న కొత్త పోర్టు, పలు ఫార్మా కంపెనీలు, సెజ్‌లో విదేశాలకు చెందిన ఫ్యాక్టరీలు నడుస్తుండడంతో ఆయా దేశాల ప్రతినిధుల రాకపోకలకు వీలవుతుందని భావించింది. అటు ఇక్కడ విమానాశ్రయం నిర్మిస్తే కాకినాడ జిల్లా వాసులకు కూడా ఉపయోగపడుతుందని అంచనాకు వచ్చింది. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా రెవెన్యూ అధికారులు కొంతకాలం కిందట తుని-అన్నవరం మధ్య తొండంగి మండలం పరిధిలోని చిన్నయ్యపాలెం, బెండపూడి గ్రామాల పరిధిలో 787 ఎకరాల భూములను గుర్తించారు. ఇందులో విమానాశ్రయం ఏర్పాటుకు అనువుగా ఉంటుందని ప్రతిపాదించారు. ఇందులో బెండపూడి గ్రామంలో 490 ఎకరాలు ప్రైవేటు, 28 ఎకరాలు ప్రభుత్వ భూములు గుర్తించారు. పీఈ చిన్నయ్యపాలెం గ్రామంలో 266 ఎకరాలు ప్రైవేటు, 1.75 ఎకరాలు ప్రభుత్వానికి ఉన్నట్లు గుర్తించారు. ఈ భూములను ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పరిశీలించవచ్చని సూచించారు. అయితే ఈ భూములను పరిశీలించిన ఉన్నతాధికారులు పలు సమస్యలు గుర్తించారు. ప్రతిపాదిత భూములు అన్నవరం రైల్వేలైను, జాతీయ రహదారికి మధ్యలో ఉండడం సమస్యాత్మకం అవుతాయని తేల్చారు. భూముల మధ్యలో 88 ఎకరాల్లో భారీ చెరువు, వీటిని ఆనుకుని పోలవరం, పుష్కర ప్రాజెక్టుల కాలువలు పయనిస్తున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు వీలు కుదరదని తేల్చారు. అయితే ఇవికాకుండా ఈ ప్రాంతంలోనే ఇంకా ఏ భూములు అనువుగా ఉంటాయో ఇటీవల జిల్లా కలెక్టర్ రెవెన్యూ, ఇతర అధికారులతో పరిశీలించారు. ప్రధానంగా జాతీయరహదారిని ఆనుకుని భూముల మ్యాపులను విశ్లేషించారు. కానీ ప్రతిచోటా పలు గ్రామాలు భూముల మధ్యలో ఉండడం, హైవేను ఆనుకుని ఎక్కడికక్కడ ఊర్లు ఉండడంతో ఇవేవీ పనికిరావని తాజాగా అంచనాకు వచ్చారు. వాస్తవానికి ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు ప్రాంతంలో జనావాసాలు అసలు ఉండకూడదు. కానీ జిల్లాలో తుని-అన్నవరం మధ్య హైవేను ఆనుకుని, కొంత లోపల ఎక్కడికక్కడ గ్రామాలున్నాయి. ఇవన్నీ విమానాశ్రయానికి అడ్డంకిగా తాజాగా గుర్తించారు. ఈ నేపథ్యంలో తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సానుకూలతలేవీ లేవని తేల్చేశారు. పైగా జిల్లా వాసులకు రాజమహేంద్రవరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టు దగ్గరేనని, ప్రయాణసమయం కూడా తక్కువేనని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో తుని-అన్నవరం మధ్య విమానాశ్రయ ఏర్పాటు ప్రతిపాదన రద్దయినట్టేనని అధికారులు చెబుతున్నారు. అటు ప్రభుత్వం కూడా ఇక్కడ ఏర్పాటుకు సానుకూలంగా లేదని తెలిపారు. కాగా తాజా నిర్ణయం నేపథ్యంలో అన్నదాతలకు భూముల బెంగ తీరినట్టే. ఇక ప్రతిపాదించిన 787 ఎకరాలు ఇవ్వడానికి వ్యతిరేకంగా తొండంగి మండలం రైతులు కొంతకాలంగా పోరాటం జరుపుతున్నారు. ఇప్పుడు అసాధ్యం అని తేలడంతో అన్నదాతలకు చిక్కులు తప్పినట్టే.

పాయకరావుపేట ఫిక్స్...

తునికి ఆనుకుని ఉన్న పాయకరావుపేట మండలంలో ఎయిర్‌పోర్టుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. తుని-అన్నవరం మధ్య గుర్తించిన ప్రైవేటు భూముల ధరలతో పోల్చితే ఈప్రాంతంలో ధరలు కూడా చాలా తక్కువేనని, లభ్యత కూడా ఎక్కువగా ఉందని అధికారులు ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చారు. పైగా ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తే నక్కపల్లిలోని ఫార్మా కంపెనీలకు, అటు తునితోపాటు కాకినాడ జిల్లావాసులకు సైతం అనువుగా ఉంటుందనే చర్చ అధికారుల్లో ఉంది. దీంతో ఇప్పుడు పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లో త్వరలో భూములు గుర్తించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పైగా ఇటీవల సీఎం చంద్రబాబు కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుపై జరిపిన సమీక్షలో అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి ప్రస్తావన వచ్చింది. ప్రస్తుతం నక్కపల్లి ఫార్మాహబ్‌గా పేరొందింది. ఎన్టీపీసీ పవర్ ప్లాంట్, మిట్టల్ స్టీల్‌ప్లాంట్ తదితర కంపెనీలు సైతం ఇక్కడకు భారీస్థాయిలో రాబోతున్నాయి. దీంతో ఇక్కడ కూడా విమానాశ్రయం అవసరం అని చంద్రబాబు అధికారుల వద్ద పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అధికారులు పాయకరావుపేట పరిసరాల్లోనే ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు.





కాకినాడ పైడా వారి సత్రంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న పార్టీ నేతలు

బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బిక్కిన విశ్వేశ్వరరావు ఏకగ్రీవ ఎన్నిక

కార్పొరేషన్(కాకినాడ)/పెద్దాపురం, జనవరి21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా నూతన అధ్యక్షుడిగా బిక్కిన విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ దేవాలయం వీధిలోని పైడా వారి సత్రంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంస్థాగత బీజేపీ ఎన్నికలకు మాజీ ఎమ్మెల్సీ కోడూరి లక్ష్మీనారాయణ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ సభా అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించగా, పార్టీ ఆదేశాల మేరకు 1994 నుంచి భారతీయ జనతా పార్టీకి విశేష సేవలు అందించిన విశ్వేశ్వరరావును అధ్యక్షుడిగా ప్రకటించారు. దీంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు గజమాలను వేసి అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపి దేవాలయం వీధిలో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష పదవి రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ సీట్లు గెలుపొందేందుకు కృషిచేస్తానని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి అందరినీ కలుపుకుని ముందుకు సాగడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మాధవ్, మాల కొండయ్య, పైడా కృష్ణమోహన్, గంటా బాలుదొర, వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు. కాగా 2009 ఎన్నికల్లో ఆయన కాకినాడ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా విశ్వేశ్వరరావు పోటీచేశారు. 2010లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనరల్ సెక్రటరీగా రెండు పర్యాయాలు పనిచేశారు. పార్టీ కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొనడమే కాకుండా జిల్లాలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేశారు. పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన తరువాత స్వగ్రామం పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చేరుకున్న ఆయనను పలువురు కూటమి శ్రేణులు, యూత్ సభ్యులు కలుసుకుని పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడంతోపాటు ఘనస్వాగతం పలికారు. బీజేపీ అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్, సీనియర్ బీజేపీ నేత పైడా కృష్ణమోహన్, దుర్గా మోహన్‌రావు, చింతా శ్యామ్, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌తోపాటు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

విశాఖ ఉక్కు పరిశ్రమకు కూటమి ప్రభుత్వ కృషి వల్లే ఆర్థిక భరోసా



మీడియాతో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకే కాకుండా ఆంధ్ర రాష్ట్రానికి మణిహారంగా నిలిచిన విశాఖ ఉక్కు పరిశ్రమకు కూటమి ప్రభుత్వ కృషి వల్ల ఆర్థిక భరోసా లభించిందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నవీన్ మాట్లాడారు. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు నినాదంతో వేలాది మంది తెలుగువారు పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్నారన్నారు. అటువంటి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునర్జీవింపజేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. జగన్మోహన రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా కేసులు మాఫీ చేసుకోవడానికి తప్ప రాష్ట్ర అభివృద్ధిగాని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకుగాని కేంద్రంతో మాట్లాడడానికి ప్రయత్నించలేదన్నారు. నేడు రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఆరు నెలల కాలంలో రూ.3 లక్షల కోట్ల నిధులు సాధించారన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ. 11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించడం అభినందనీయమన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయాలని, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్మోహనరెడ్డి ప్రయత్నిస్తే, విశాఖ ఉక్కు పరిరక్షణకు కూటమి నాయకులు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. దావోస్ వెళ్లి రాష్ట్రంలో పెట్టుబడుల కోసం చంద్రబాబు కృషి చేస్తుండడం చాలా గర్వంగా ఉందన్నారు. ఆయన వెంట యువ నాయకులు ఉండడం, వారు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయడం రాష్ట్ర ప్రజలకు ఎంతో ఆనందకరమని నవీన్ అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పేరాబత్తుల రాజశేఖర్, రామదేవు సీతయ్యదొర, పోతుల మోహనరావు, అడబాల ఆంజనేయులు, జహరుద్దీన్ జిలాని పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా విజయకుమారి



ఐసీడీఎస్ పీడీ విజయకుమారి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ పీడీగా కె.విజయ కుమారి బాధ్యతలు చేపట్టనున్నారు. విజయనగరం జిల్లా విజయనగరంలో సీడీపీవోగా పనిచేస్తున్న ఆమె ఐసీడీఎస్ పీడీ ఆఫీసులో నోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె ఐసీడీఎస్ పీడీగా కాకినాడ జిల్లా రానున్నారు. ఇప్పటివరకు పీడీగా పనిచేసిన ప్రవీణ గుంటూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసరావు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎ.శ్రీనివాసరావును నియమించారు. ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి ఇన్‌చార్జి పీడీగా కొనసాగుతున్నారు. గతంలో ఆమె ఇక్కడ పీడీగా పనిచేస్తూ పెద్దాపురం ఆర్డీవోగా బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఇన్‌చార్జి పీడీగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు జిల్లాలో బీసీ కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసరావుకు డీఆర్‌డీఏపీడీగా అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో అమలవుతున్న పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్. (పక్కన) కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప , జేసీ రాహుల్‌మీనా

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి

దిశ సమావేశంలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి మరింత మందికి లబ్ధి చేకూరేలా అధికారులు కృషిచేయాలని కాకినాడ పార్లమెంటు సభ్యుడు, దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) చైర్మన్ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం దిశ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానాంశాలైన బ్యాంకింగ్‌కి సంబంధించి పీఎం ఈజీపీ, పీఎంఎంవై, ముద్రా వంటి పథకాలు, వైద్యఆరోగ్యశాఖ కింద జాతీయ ఆరోగ్య పథకం, జనని సురక్షయోజన, ప్రధానమంత్రి మాతృవందన, సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే వ్యవసాయం, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ కింద అమలవుతున్న ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, పీఎం కిసాన్ కార్డులు, పంచాయతీ శాఖకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు, పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పీఎం విశ్వకర్మయోజన, కాకినాడ స్మార్ట్‌సిటీ పనుల కోసం ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు నిర్వహించే కాకినాడ జిల్లా దిశ కమిటీ సమావేశం ద్వారా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో సక్రమంగా అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని సమస్యలపై ఒంపీ ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన, వివిధ మండలాల ఎంపీపీలు, దిశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొరిపల్లిలో మాయమైన బియ్యం 632 మెట్రిక్ టన్నులు

పౌరసరఫరాల సంస్థ ఎండీకి నివేదిక.. తొమ్మిదేళ్లలో వచ్చిన లాస్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): కరప మండలం కొరిపల్లిలో ఒక ప్రైవేట్ గోదాములో మాయమైన రేషన్ బియ్యం లెక్కతేలింది. తొమ్మిదేళ్ల కాలంలో 632 మెట్రిక్ టన్నులు స్టోరేజ్ లాస్ వచ్చినట్టు జిల్లా అధికారులు గుర్తించారు. ఈ నివేదికను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీకి పంపారు. 2016 నుంచి నిల్వ ఉంచిన బియ్యానికి సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. దాదాపు నెల రోజులపాటు తొమ్మిది ఏళ్ల రికార్డులను అధికారులు తనిఖీలు చేశారు. నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఎప్పుడెప్పుడు తరలించారు వంటి అన్ని వివరాలను సమగ్రంగా పరిశీలించారు. ఎట్టకేలకు 632 మెట్రిక్ టన్నుల బియ్యం స్టోరేజ్ లాస్‌గా గుర్తించారు. అయితే మొత్తంగా ఎంత లాస్ వచ్చింది, బియ్యం గోదాం యజమాన్యం నుంచి ఎంత రికవరీ చేస్తారు వంటి విషయాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే చినరాజప్ప

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): రూ. 10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం అందజేశారు. కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాజేశ్వరినగర్‌కు చెందిన అరవపల్లి మణికంఠకు, అశోక్‌నగర్‌కు చెందిన తోకాడ లావణ్య కుమారికి ఈ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు.





కలసి రాని 'సీజన్'

- సీజనల్ చామంతులకు గడ్డుకాలం
- పండుగలొచ్చినా అమ్మకాలు డల్

కడియం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకల్లో సందడి చేసే సీజనల్ పుష్పాలు ఈ ఏడాది అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పండుగలు వచ్చి వెళ్లిపోయినా, కొనుగోలుదారులు రాక ఈ రంగురంగుల సీజనల్ మొక్కలు అన్ని నర్సరీల్లోనే ఉండిపోయాయి. ఈ పండుగల్లో అలంకరణకు ఈ మొక్కలను అధికంగా వినియోగిస్తారు. అందుకే ప్రతీ ఏటా పెద్దఎత్తున నర్సరీ రైతులు ఈ మొక్కలను ఉత్పత్తి చేసి అమ్మకాలకు సిద్ధం చేస్తారు. ఈ ఏడాది తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు లేకపోవడం వల్ల మొక్కలు పూర్తిస్థాయిలో వికసించాయి. కానీ అమ్మకాలు లేకపోవడంతో నర్సరీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం మంచు కురిసే శీతాకాల సమయంలో మాత్రమే ఈ సీజనల్ పుష్పాలు వికసించి ఫిబ్రవరి మాసం ఎండ చుర్రుమనగానే వాడిపోతాయి. అందుకనే వీటిని సంక్రాంతి నాటికి అమ్మకాలు పూర్తిచేస్తారు. అయితే అమ్మకాలు లేకపోవడంతో నర్సరీల్లో ఈ మొక్కలు ఉండిపోయాయి. సందర్శకులను అలరిస్తున్నా.. ఈ మొక్కలు రైతులకు మాత్రం విక్రయాలు సాగడం లేదు. కడియం మండలం వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ నర్సరీల నుంచి కొనుగోలుదారులు ప్రతిఏటా పెద్దఎత్తున సీజనల్ మొక్కలు కొనుగోలు చేసి తీసుకెళుతుంటారు. ఈ ఏడాది అమ్మకాలు అంతంతమాత్రంగా ఉండడంతో రైతులు ధరలు కూడా తగ్గించారు. సైజును బట్టి మొక్క ఒక్కింటికి రూ.100 నుంచి 150కు విక్రయించే ఈ మొక్కలను 50 నుంచి 100 వరకు అమ్మకాలు చేస్తున్నారు.

నల్ల మిర్చి.. బ్లాక్ చిల్లీ..

కడియం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం బుర్రిలంక గ్రామంలో పేపరు ఏజెంట్ మలసాని గోవిందరాజులు ఇంటి ఆవరణలో బ్లాక్‌చిల్లీ అందర్నీ అబ్బురపరుస్తోంది. ప్రకాశం జిల్లాకు చెందిన తన స్నేహితుడు తనకు ఈ మొక్కను ఇచ్చాడని, ఇంటి ఆవరణలో ఉన్న మొక్కలతోపాటు వీటిని కుండీల్లో వేసి పెంచుతున్నానని, చెట్టుకు 35 నుంచి 40 కాయలు కాస్తోందని గోవిందరాజులు తెలిపారు. ఈ కాయలు కూరకు కోయడం లేదని, అందంగా ఉండడంతో కుండీల్లో పెంచుతున్నానని తెలిపారు.





కాకినాడ రామారావుపేటలోని అన్నా క్యాంటీన్.. క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్న దృశ్యం

ఎలా ఉందో చెప్పండి.. క్యూఆర్ కోడ్‌లో..

- అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజాభిప్రాయ సేకరణ
- నిర్వాహకులపై పలు ఫిర్యాదులు అందుతున్నట్టు సమాచారం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, క్యాంటీన్ల నిర్వహణ తీరుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాలను సేకరిస్తోంది. ఇందుకోసం ఆయా క్యాంటీన్ల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి భోజనం చేయడానికి వచ్చే వారి అభిప్రాయాలను కోరుతోంది. పట్టణ ప్రాంతాల్లో నిరుపేద కార్మికులు, దినసరి కూలీల ఆకలి తీర్చేం దుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక్కడ పూటకి ఐదు రూపాయలకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారు. భోజన సరఫరా బాధ్యతను స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. అయితే అల్పాహారం, భోజనం నాణ్యతపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలని ప్రభుత్వం భావించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించింది. డిజిటల్ లావాదేవీల తరహాలో క్యూఆర్ కోడ్‌ను అమలుల్లోకి తెచ్చింది. కాకినాడ జిల్లాలో మొత్తం 25 అన్న క్యాంటీన్లు ఉన్నాయి. కాకినాడలో వివేకానంద పార్కు, సంతచెరువు, డెయిరీఫారం సెంటర్, జగన్నాథపురం, సర్పవరం, రమణయ్యపేట మార్కెట్ అన్నక్యాంటీన్ల వద్ద లోపల, బయట గోడలపై క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటుచేశారు. భోజనం చేయడానికి వచ్చినవారు తమ చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఈక్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఈ క్యాంటీన్‌ను సకాలంలో తెరుస్తున్నారా, ఆహార పదార్థాలు నాణ్యతగా ఉంటున్నాయా, పరిశుభ్రతను పాటిస్తున్నారా అని మూడు ప్రశ్నలు వస్తాయి. అవును, లేదు అని ఆప్షన్ ఉన్నచోట ఏదో ఒకదానిపై క్లిక్ చేస్తే సరిపోతుంది. అయితే ఎక్కువ శాతం అన్నక్యాంటీన్‌కి వచ్చే వారికి పెద్దగా ఆండ్రాయిడ్ మొబైల్స్ లేకపోవడంతో అన్నక్యాంటీన్‌కి వస్తున్న కొద్దిమంది విద్యార్థులు మాత్రమే ఈ క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని ఉపయోగించుకుని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఆహార పదార్థాల వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకపోయినా నిర్వాహకుల తీరుపై ఫిర్యాదులు అందుతున్నట్టు తెలుస్తోంది. కాకి నాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ క్యాంటీన్లలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఏర్పాటుచేసిందని చెప్పారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న దృశ్యం





విద్యార్థిని సంపర్తి పూజితను అభినందిస్తున్న స్కూల్ కమిటీ సభ్యులు

అండర్ 19 నేషనల్ మీట్‌కి ఎంపికైన సీజీటీఎం విద్యార్థిని పూజిత

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సీజీటీఎం ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సంపర్తి పూజిత జాతీయస్థాయి అండర్-19 స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం స్కూల్ ప్రాంగణంలో పూజితను సీజీటీఎం పాఠశాల అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అభినందించి ప్రోత్సాహక పారితోషికం అం దించారు. పూజిత అండర్-15 క్రికెట్ నుంచి అండర్-19 వరకు అనేక పతకాలను సాధించింది. ఇప్పుడు జాతీయస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ చింతల కృష్ణాజీ, జాయింట్ సెక్రటరీ నేమాని రాజశేఖర్, కోశాధికారి నందివాడ చంద్రశేఖర్, సీహెచ్ నారాయణ, సూపరింటెండెంట్ ఎం. వెంకట్రాజు, ప్రధానోపాధ్యాయురాలు లిడియాగ్రేస్ అభినందించారు.

ఆధ్యాత్మికతత్వంతో మానసిక ప్రశాంతత

మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ

పిఠాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతత్వంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. పిఠాపురం పట్టణంలోని అనఘా దత్తక్షేత్రంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం జరిగిన పూజల్లో స్వామితోపాటు ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి పాల్గొన్నారు. ఉదయం కలశ పూజ, వేద పారాయణ, గోపూజ, శ్రీ చక్రార్చన, రుద్రయాగం, కార్యసిద్ధి ఆంజనేయస్వామికి మన్యుసూక్త హోమం, సాయంత్రం ప్రదోషకాల పూజ, శ్రీదత్త డోలోత్సవం నిర్వహించారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ నిర్వహించిన పాదగయ రాగ సాగర కచేరీ భక్తతన్మయత్వంలో ముంచెత్తింది. రాత్రి భక్తులనుద్దేశించి స్వామీజీ అనుగ్రహభాషణ చేస్తూ నిత్య జీవితంలో ఆధ్యాత్మికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి... పిఠాపురం అనఘా దత్తక్షేత్రంలో భక్తులతో మాట్లాడుతున్న మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ





రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్యులకు సూచనలిస్తున్న డాక్టర్ శంకరరావు, డాక్టర్ రియాజ్

మన్యంలో 'ముస్కాన్' బృందం పర్యటన

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సందర్శన... బాలలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా

రంపచోడవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో బాలల ఆరోగ్యం, వారికి అందుతున్న ఆరోగ్య సేవలను పరిశీలించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న 'ముస్కాన్' బృందం మంగళవారం పర్యటించింది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చంటి పిల్లలు, బాలల ఆరోగ్య సేవల విభాగాన్ని బృందం ప్రతినిధులు డాక్టర్ గోపాల్ శంకరరావు, డాక్టర్ రియాజ్ పరిశీలించారు. పుట్టిన శిశువుల నుంచి 12 ఏళ్ల వరకు దేశవ్యాప్తంగా ఉన్న బాలల ఆరోగ్యం, వైద్య సేవల కోసం కేంద్రం ముస్కాన్ ద్వారా మెరుగైన వైద్య, ఆరోగ్య వనరులను కల్పిస్తోంది. ఆయా ఆసుపత్రుల స్థాయిని బట్టి ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అందాల్సిన సేవలు, ఉండాల్సిన వైద్యులు, వనరులను ఇప్పటికే నిర్దేశించారు. ఆ మేరకు ఆయా ఆరోగ్య కేంద్రాల్లో సేవలు కచ్చితంగా అందుతున్నాయో లేదో అన్న అంశాన్ని ఈ బృందం పరిశీలిస్తోంది. గుర్తించిన సానుకూల, ప్రతికూల అంశాల మేరకు తదనంతర సదుపాయాలు, చర్యలు కేంద్రం నుంచే అందుతాయి. ముఖ్యంగా శిశు మరణాలను తగ్గించడం, ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడడం, అన్ని అత్యవసర సేవలను బాలల కోసం సిద్ధంగా ఉంచడం వంటి కీలక అంశాలను ఈ బృందం గమనిస్తోంది. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో అందుతున్న శిశు ఆరోగ్య సేవలు, అందుబాటులో ఉన్న విభాగాలను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సేవలు, వనరులపై బృందం ప్రతినిధులు ఆరా తీశారు. రంపచోడవరం మన్యంలో ఉన్న పరిస్థితులను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ వివరించారు. తొలుత ప్రతినిధులను ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఏజెన్సీ వైద్య ఆరోగ్యాధికారులు, ఆసుపత్రి వైద్యాధికారులు, ఆసుపత్రి కమిటీ సభ్యుడు చోటు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి



ధర్మవరంలో కబడ్డీ పోటీలో తలపడుతున్న ఇరు జట్ల క్రీడాకారులు





శాంతి ఆశ్రమంలో మాట్లాడుతున్న మాతా జ్ఞానేశ్వరీ దేవి, ప్రణవ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మనాభానంద సరస్వతి

ఓంకార స్వామి బోధనలు ఆచరణదాయకం

రుషికేష్ పీఠాధిపతి పద్మనాభానంద సరస్వతి

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం తోటపల్లిలోని శాంతి ఆశ్రమంలో వ్యవస్థాపకుడు ఓంకార స్వామి 131వ జయంతి వేడుకలు మంగళవారం నిరాడంబరంగా జరిగాయి. ప్రణవ పతాకాన్ని హిమాలయాలకు చెందిన రుషికేష్ పీఠాధిపతి పద్మనాభానంద సరస్వతి ఆవిష్కరించారు. ఓంకార మందిరంలో శాంతి ఆశ్రమ పీఠాధిపతి మాతా జ్ఞానేశ్వరీదేవి జ్యోతిప్రజ్వలన చేసి ఓంకార స్వామికి పూజలు నిర్వహించారు. జ్ఞాన మందిరంలో జరిగిన సమావేశంలో పద్మనాభానంద సరస్వతి మాట్లాడుతూ ఓంకార స్వామి ప్రపంచ శాంతికి కృషి చేశారని, ఆయన బోధనలు సర్వమానవాళికి ఆచరణదాయకమని చెప్పారు. 150 ఎకరాల విస్తీర్ణంలో శాంతి ఆశ్రమాన్ని ఏర్పాటుచేసి సర్వమత ప్రార్థనలకు కట్టడాలు నిర్మించారన్నారు. ప్రణవానంద మాతాజీ, భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో భజనలకు అవకాశం కల్పించండి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుని కలిసిన భజన కళాకారులు

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో భజనల ఏర్పాటుకు దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడతానని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన జిల్లా భజన మండలి అధ్యక్షుడు సానా నూకరాజునాయుడు, చిత్రాడ ఆశ్రమానికి చెందిన విశ్వానంద భారతీస్వామి ఆధ్వర్యంలో భజన బృందాలు తుని మండలం తేటగుంటలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం యనమలను కలిశారు. ఇప్పటికే టీటీడీ దేవస్థానం పాలకమండలి అనుమతితో కళాకారులు నిత్యం భజనలు చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తిరుమలలో మాదిరిగానే అన్నవరం సత్యదేవుని సన్నిధిలో భజనలు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని యనమల చెప్పారు. కార్యక్రమంలో భజన కళాకారులు పైలా అప్పలనాయుడు, సూర్యనారాయణ, అద్దేపల్లి రాజా, సిద్దా పెద్దిరాజు, గంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తేటగుంటలో యనమలను కలిసిన విశ్వానంద భారతీస్వామి, నూకరాజునాయుడు, కళాకారులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో సంక్రాంతి సంబరాలు ముగింపులో భాగంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. 36 బృందాలు ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. తొలిరోజైన సోమవారం 14 జట్లు తలపడగా 7 జట్లు విజేతలుగా నిలిచాయి. రెండో రోజైన మంగళవారం మరో 7 జట్లు తలపడ్డాయి. ఎంఎంఆర్ ట్రస్టు అధినేత మురళీరాజు, పెద్దలు ముదునూరి సీతారామరాజు, జువ్వల బాబులు, నానిపల్లి చంటి, ఉప సర్పంచ్ బొల్లు చిట్టిబాబు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, చేకూరి రాంబాబు, దెందుకూరి హరి తిలకించారు.



వేటూరి సాహితీ పురస్కారానికి

సుద్దాల అశోక్‌తేజ ఎంపిక

29న తునిలో ప్రదానం

తుని రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా పాటల రచయిత, తెలుగు సాహిత్యకారుడు, రెండువేలకు పైగా సినిమాల్లో మూడువేలపైచిలుకు పాటలు రాసిన సుద్దాల అశోక్ తేజకు వేటూరి చతుర్దశ (14వ) సాహితీ పురస్కారం అందజేయనున్నట్టు వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మ, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈ నెల 29న వేటూరి జయంతి సందర్భంగా తుని చిట్టూరి మెట్రోలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేస్తామన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల హాజరవుతారన్నారు. వేటూరి సాహితీ పీఠానికి శాశ్వత గౌరవాధ్యక్షుడిగా ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా చక్కా సూర్యనారాయణ, అధ్యక్షుడిగా సీహెచ్ వీకే నరసింహారావు వ్యవహరిస్తున్నారు.

కూనవరంలో రేపు 'పోలవరం' గ్రామ సభ

కూనవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూనవరంలో గురువారం పోలవరం గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల కోల్పోతున్న వారందరికీ ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. గ్రామసభకు వచ్చేవారు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, కరెంటు బిల్లు, ఇంటి పన్ను తేవాలన్నారు. ఇంటి పన్ను తప్పనిసరిగా ఒరిజినల్ అయి ఉండాలన్నారు. ఇంటి యజమాని పాస్‌పోర్టు ఫొటో తీసుకురావాలన్నారు.

ఆసుపత్రికి వెళ్తుంటే.. ఆయువు పోయింది!





సందీప్ మృతదేహం వద్ద పోలీసులు, నాయకులు, సందీప్ (ఫైల్ ఫొటో)

- గోడిలంక వద్ద రోడ్డు ప్రమాదం
- ఐదేళ్ల బాలుడి దుర్మరణం
- తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు

అల్లవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడిలంక వద్ద ఆర్అండ్‌బీ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు మృతిచెందగా తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. అల్లవరం మండలం గోడిబాడవకు చెందిన సిర్రా దుర్గాప్రసాద్, శిరీష దంపతులు తమ కుమారుడు సందీప్ (5)కు రెండు రోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వారు ముగ్గురు మోటారు సైకిల్‌పై అమలాపురం ఆసుపత్రికి బయలుదేరారు. గోడిలంక శ్మశానవాటిక వద్దకు వచ్చేసరికి ఒక కుక్క వేగంగా అడ్డురావడంతో అదుపు తప్పి మోటారు సైకిల్‌పై నుంచి వారు కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడ్డ వారిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి హుటాహుటీన తరలించారు. బాలుడు సందీప్ తలకు తీవ్ర గాయమై అప్పటికే మృతిచెందినట్టు కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు శిరీష-దుర్గాప్రసాద్‌లు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, తోట నరసింహారావులు ఆసుపత్రిలో సందీప్ మృతదేహం వద్ద ప్రగాఢ సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు గాయపడి వారి కుమారుడు మృతి చెందడం పట్ల ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సత్యదేవుడి సన్నిధిలో... ప్రసాద్‌స్కీం పనులకు మరో ముందడుగు



అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తున్న టూరిజం అధికారులు

అన్నవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో గడిచిన తొమ్మిదేళ్లగా ఊరిస్తూ వస్తున్న కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు మరో ముందడుగు పడింది. సుమారు రూ.25.32 కోట్లతో అన్నదానభవనం, క్యూ కాంప్లెక్స్, రిటైనింగ్ వాల్, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్‌స్టేషన్లకు సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అయితే ఎన్నికలు ముగిసి ఆరునెలలు గడిచినా పనులు ప్రారంభంకాలేదు. ఒక పర్యాయం టెండర్లు పిలిచి తరువాత టెండర్లను టూరిజంశాఖ రద్దు చేసింది. తిరిగి ఈనెల 9వతేదీన మరోసారి టెండర్లు పిలవగా 24వతేదీన టెండర్లు తెరవనున్నారు. తెరిచిన నెలరోజుల్లో పనులు ప్రారంభించడం జరుగుతుందని టూరిజం అధికారులు తెలిపారు. ఈమేరకు మంగళవారం దేవస్థానం ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్‌లతో ఆర్కిటెక్చర్స్ టి.బాలకృష్ణ, శ్రీనివాస్, టూరిజం ఏఈఈ వెంకటేష్ చర్చించి అన్నదాన భవనం నిర్మించబోయే టీటీడీ సత్రం స్థలాన్ని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా ప్రసాద్‌స్కీం ద్వారా నిర్మించబోయే అన్నదాన భవనం కోసం ఎదురుచూస్తున్నామని, ప్రస్తుతం అన్నదాన భవనం పూర్తిస్థాయిలో భక్తులకు సరిపోవడం లేదని వారికి వివరించగా నెలరోజుల్లో పనులు ప్రారంభమవుతాయని టూరిజం అధికారులు వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు వి.రామకృష్ణ, నూకరత్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం యోగా అభ్యాసనంతో సహజంగా సుఖశాంతులు

అన్నవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి అనునిత్యం యోగా, జ్ఞానయోగా అభ్యాసం ద్వారా సహజంగా సుఖశాంతులు పొందవచ్చునని ఉషాదీదీ పేర్కొన్నారు. 3రోజులపాటు సత్యదేవుడి సన్నిదిలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో జరిగే సర్వగుణ సంపన్నత యోగా బట్టిని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవస్థానం ఛైర్మన్ ఐవీ రోహిత్, తుని మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రతీ వ్యక్తి జీవితంలో సామాజిక, మానసిక ఒత్తిడితో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీంతో ప్రతిఒక్కరికి మనశ్శాంతి, సుఖం కావాలని అవన్నీ ఆధ్యాత్మిక భావం, యోగాభ్యాసం ద్వారా సిద్దిస్తాయన్నారు. కార్యక్రమానికి ముంబాయి నుంచి హల్కాదీది, నాలుగుజిల్లాల ఇన్‌ఛార్జిలు రజనీ, అన్నపూర్ణ, సుమిత్రానంద సరస్వతీతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా బ్రహ్మకుమారీలు హాజరయ్యారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న ఛైర్మన్ రోహిత్, బ్రహ్మకుమారీలు

తల్లిదండ్రులు దూరమయ్యారనే బెంగతో...

అనపర్తిలో యువకుడి ఆత్మహత్య



రవితేజ మృతదేహం

అనపర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మార్కెండేయపురానికి చెందిన మంతిన రవితేజ(26) మంగళవారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రవితేజ తల్లి 2021లో ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. తరువాత క్రమంలో రవితేజ తండ్రి కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అవివాహితులైన రవితేజ, అతడి సోదరుడు అచ్యుత్‌లు విడివిడిగా నివాసం ఉంటున్నారు. ఇటీవల తల్లి మరణం కేసులో సోదరులిద్దరూ కోర్టుకు సాక్ష్యం చెప్పేందుకు వెళతున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు దూరమయ్యారనే బెంగతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తాను ఉంటున్న ఇంటిలో రవితేజ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవితేజ సోదరుడు అచ్యుత్ అన్న ఇంటికి వెళ్లి ఎంత కొట్టినా తలుపులు తెరవక పోవడంతో కిటికీలో నుంచి చూడగా ఆత్మహత్యకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని..

బాలుడిపై బ్లేడుతో తండ్రి దాడి



గాయపడిన బాలుడు

ముమ్మిడివరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె వెంటపడి ప్రేమిస్తున్నానని వేధిస్తున్న బాలుడిపై బాలిక తండ్రి బ్లేడుతో దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో జరిగింది. ముమ్మిడివరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలుడు అదే ఆ పాఠశాలకు ఎదురుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికతో మాట్లాడుతూ వెంటాడడంతో బాలిక తండ్రి పలుసార్లు ఆ బాలుడిని మందలించాడు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మంగళవారం బ్లేడుతో బాలుడిపై పలుచోట్ల దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన బాలుడు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ జీవీ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలుడిపై దాడి చేసిన బాలిక తండ్రి పోలీసులకు లొంగిపోగా అతను నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం.

గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం




లభ్యమైన సతీష్ మృతదేహం

అల్లవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడితిప్ప కైలాసభూమి వద్ద వైనతేయ గోదావరిలో వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామానికి చెందిన అవివాహితుడు లింగోలు వీరవెంకటసత్యనారాయణ (సతీష్)(31) మృతదేహం అల్లవరం మండలం గోడితిప్ప వద్ద వైనతేయ నదిలో మంగళవారం లభ్యమైంది. అమలాపురంలోని జోళ్ల షాపులో పనిచేస్తున్న సతీష్ తల్లి 6నెలల క్రితం మరణించగా ఒంటిరిగా ఉంటూ మానసిక ఆందోళనకు గురై జీవితంపై విరక్తితో గోదావరిలో దూకేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. తన మోటారు సైకిల్‌ను గట్టు మీద పెట్టి దూకేశాడని భావిస్తున్నారు. సోమవారం రాత్రి అతడి కోసం వెతికినా జాడ లేదని, గోడితిప్ప రేవులో సతీష్ మృతదేహం మంగళవారం లభ్యమైనట్టు పోలీసులు తెలిపారు. మానసిక ఆందోళనతో పాటు ఆర్థిక సమస్యలు కూడా కారణమై ఉంటాయని భావిస్తున్నారు. రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. గోడితిప్ప వీఆర్వో సమక్షంలో పంచనామా జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టానికి అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతమే లక్ష్యం

- ప్రతీ గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల తప్పనిసరి
- విద్యాశాఖ ప్రాంతీయ సదస్సులో డైరెక్టర్ విజయరామరాజు



సదస్సులో మాట్లాడుతున్న విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, పాల్గొన్న కలెక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకు సాగుతుందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని మానవ వనరుల అధికారులు, ప్రధానోపాధ్యాయులతో రాష్ట్రంలో నూతన విద్యా విధానంపై నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడానికి మానవ వనరుల విభాగంలో భాగస్వామ్యం అయిన మేధావి వర్గంతో అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో 6,7,8 విద్యార్థులు ఉన్న చోట విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ప్రక్రియ సజావుగా పూర్తి చేయడానికి జిల్లా పరిపాలన యంత్రాంగం ప్రమేయం చాలా అవసరమన్నారు. అందుకనుగుణంగా ఆయా సమన్వయ శాఖల అధికారులతో వర్క్‌షాపును ఏర్పాటు చేశామన్నారు. నూతన ప్రతిపాదిత విధానంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, హైస్కూల్‌గా పాఠశాలల ఉన్నతీకరణ చేస్తామన్నారు. ఈ మేరకు జిల్లాలో క్లస్టర్లు ఏర్పాటు, ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 25 పాఠశాలలు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీటిలో చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వారి అభిప్రాయాలను సమీకరించి ఒక సమగ్ర అధ్యయన నివేదిక రూపొందిస్తామని తెలిపారు.

ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాల్య సంరక్షణ, విద్యసజావుగా ఉండేలా ఉమ్మడి అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలతో అనుసంధానించడం గాని లేదా సమీపంలోని అంగన్వాడీ కేంద్రాలను మార్చడం ద్వారా ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ కలెక్టర్లు పి.ప్రశాంతి, మహేష్ రావిరాల, ఎస్.షాన్‌మోహన్, కమిషనర్ కేతన్ గార్గ్, పాఠశాల విద్యా ప్రాంతియ సంయుక్త డైరెక్టర్ జి.నాగమణి, ఆర్‌డీవోలు, డిప్యూటీ డీఈవోలు,ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలను కలిసిన పొన్నాడ



పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రితో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ

యానాం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కాంగ్రెస్ నేతలతో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ సమావేశమయ్యారు. యానానికి చెందిన కాపు సంఘ అధ్యక్షుడు కాంటంశెట్టి రామూర్తి, యానాం కాంగ్రెస్ ప్రతినిధి ఆర్ధాని దినేష్‌లతో కలిసి పుదుచ్చేరి వెళ్లిన పొన్నాడ సతీష్ పుదుచ్చేరి కాంగ్రెస్‌కు చెందిన లోక్‌సభ సభ్యుడు, పుదుచ్చేరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.వైద్యలింగం, మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే వైద్యనాధన్‌లను మార్యపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. పలు అంశాలపై చర్చించనట్లు తెలుస్తుంది. ఈ భేటి ప్రస్తుతం ఇటు ముమ్మిడివరం, యానాంలోను రాజకీయంగా తీవ్ర చర్చకు దారీ తీస్తుంది. రానున్న ఎన్నికల్లో యానాం నుంచి గురువు మల్లాడికి, మల్లాడి వర్గానికి వ్యతిరేకంగా పొన్నాడ పోటీ చేస్తారని సోషల్ మీడియాలో వార్త హల్‌చల్ చేస్తుంది.

బాలిక మిస్సింగ్‌పై పోక్సో కేసు నమోదు

కె.గంగవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామానికి చెందిన మైనర్ బాలిక అపహరణపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పామర్రు ఇన్‌చార్జి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పామర్రు గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలిక ఈనెల 19న ఇంటి దగ్గర నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఆచూకీ నేటికి తెలియకపోవడంతో అపహరణగా పోక్సో కేసు నమోదు చేసి రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

19 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద మంగళవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, సిబ్బంది 19.265 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేశారు. శంఖవరం మండలం సిద్దువారిపాలెనికి చెందిన తరుం వెంకటేశ్వరరావు ఒక మూటలో గంజాయి తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు.



90శాతం లక్ష్యాలను అధిగమించాం

పోస్టల్‌శాఖ బీమా పథకాలు అత్యంత ప్రయోజనకరం

రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు



రాయవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న శేషారావు

రాయవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అతి తక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి పొందేలా పోస్టల్‌శాఖ నిర్వహిస్తున్న బీమా పథకాలు అత్యంత ప్రయోజనకరమని, ఈ ఏడాది మార్చి మాసాంతానికి రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రూ.50 కోట్ల గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్), పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్(పీఎల్ఐ) ప్రీమియం చేయాలన్నది లక్ష్యంకాగా ఇప్పటికే 90శాతం లక్ష్యాలను అధిగమించినట్టు రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు. మంగళవారం రాయవరం తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేసిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో రాజమహేంద్రవరం ఈస్టు, వెస్టు, రామచంద్రపురం, రంపచోడవరం, చింతూరుతో 5 డివిజన్లు, 63 సబ్ పోస్టు ఆఫీసులు, 307 బ్రాంచ్ పోస్టు ఆఫీసుల ద్వారా ఆర్‌డీ, టర్మ్ డిపాజిట్లు, ఎంఐఎస్, సీనియర్ సిటిజన్, కిసాన్ వికాస్ పత్రాలు, నేషనల్ సేవింగ్స్ స్కీమ్, సుకన్య సంవృద్ధి తదితర పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఖతాదారులందరికీ మెరుగైన ఆన్‌లైన్ సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. 2018లో ప్రధాని మోదీ ప్రారంభించిన ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ) ద్వారా ప్రజలకు అన్ని సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా అందా లన్న లక్ష్యంతో ఎన్‌పీసీఐను బ్యాంక్, పోస్టల్ సేవి ంగ్ ఖాతాదారులు ఉన్నవారికి అనుసంధానం చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో జిల్లా కలెక్టర్లు, ఎంపీడీవోల సహకారంతో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 1లక్షా 50 వేల మందికి ఎన్‌పీసీఐ చేయగలిగామన్నారు. పర్సంటేజ్ పరంగా రాజమహేంద్రవరం డివిజన్ రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఎన్‌పీసీఐ లింక్ చేసిన ఖాతాదారులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు నేరుగా వారి ఖాతాలకే జమ అవుతాయన్నారు. డివిజన్ పోస్టల్ కార్యాలయంలో పోస్‌పోర్ట్ కేంద్రం ద్వారా రోజూ 70 నుంచి 80 మంది వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, నమోదుకు అవసరమైనపత్రాలతో వచ్చిన వారికి సత్వర సేవలు అందిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో 34 శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు తదితర సేవలు తక్కువ ధరకు అందిస్తున్నట్టు చెప్పారు.

దేవదాయశాఖ డీసీ పర్యటన

కరప, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఉభయగోదావరి జిల్లాల డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు మంగళవారం కరప మండలంలో పర్యటించారు. వేళంగిలో పాతూరి బులివెంకాయమ్మ సత్రాన్ని సందర్శించారు. సత్రం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేసి కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు ఇచ్చినట్టు ఈవో మోర్తా మురళీవీరభద్రరావు డీసీకి తెలిపారు. సత్రం వంశపారంపర్య ధర్మకర్త మెర్ల సరోజామాణిక్యాంబ నూతన భవనానికి కొంతమొత్తం విరాళం ఇచ్చేందుకు ముందుకొచ్చినట్టు వివరించారు. దీంతో సత్రం కోసం భవనం నిర్మించి మిగిలిన ఖాళీస్థలంలో షాపులు నిర్మించేందుకు మూడేళ్ల లీజు కోసం ప్రతిపాదనలు పంపిస్తామని డీసీ వెల్లడించారు. అనంతరం కరప వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, ఈవో తిరుమల రవితేజ, అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



వేళంగి సత్రాన్ని పరిశీలిస్తున్న డీసీ

29న చొల్లంగి తీర్థాన్ని విజయవంతం చేయాలి

కరప, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈనెల 29వ తేదీన జరిగే చొల్లంగి అమావాస్య తీర్థాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. కరప మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, ట్రాఫిక్, ఎండోమెంట్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యఆరోగ్యశాఖల అధికారులతో ఏర్పాట్లపై ఆమె సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పేర్గాంచిన చొల్లంగి తీర్థానికి వేలాది మంది భక్తులు రానున్న దృష్ట్యా అందుకు తగ్గ ఏర్పాటుచేయాలన్నారు. ఉప్పలంక శివారు మొండిలో బాలత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి, చొల్లంగిలోని సీతారామస్వామి, ఆంజనేయస్వామివార్ల ఆలయాలకు అన్ని రకాల హంగులు కల్పించాలన్నారు. సముద్ర స్నానాలాచారించే స్నానఘట్టాలు, పరిసరాలను శుభ్రంచేయాలన్నారు. భక్తులకు తాగునీటి సదుపాయం, వైద్యఆరోగ్యశిబిరం ఏర్పాటుచేయాలన్నారు. ఆలయ పరిసరాలు, చుట్టుపక్కల పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. అప్పన్నెద్దులను మధ్యాహ్నం నుంచి స్నానఘట్టాల వద్దకు అనుమతించాలని సూచించారు. యానాం జాతీయరహదారిని చేర్చి ఈ తీర్థం జరగనున్న దృష్ట్యా రెండురోజుల ముందు నుంచి ట్రాఫిక్‌ను మరలించాల న్నారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఎంఎస్ ఎన్ చారిటీస్ కార్యనిర్వాహణాధికారిణి కె.విజయలక్ష్మి, తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఎస్ఐ తోట సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వి.వర్ధన్, ఏవో బీఎల్ నరసింహరావు, ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలి

కుడా ఛైర్మన్ తుమ్మల బాబు

'శ్రీప్రకాష్‌లో' ఘనంగా ముగిసిన జాతీయస్థాయి స్కూల్ చెస్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న తుమ్మల, అతిథులు

పెద్దాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో గత 5 రోజులుగా జరిగిన జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్ మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు, ఓటములు సహజమని, ఓటమిని విజయం సాధించడానికి మరో అవకాశం దక్కినట్టు భావించాలన్నారు. ముఖ్యంగా చెస్ క్రీడ పట్ల యువత ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్ ఛైర్మన్ కేవీవీ శర్మ మాట్లాడుతూ పెద్దాపురం శ్రీప్రకాష్ పాఠశాలలో జాతీయస్థాయి చెస్ పోటీలు నిర్వహించడం గర్వకారణమన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియచేశారు. అనంతరం పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ అజిత్‌కుమార్ వర్మ, ఆర్ఎస్ఎస్ రామచంద్రరావు, కాళ్ల జ్వాలాముఖి, చెస్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్, పాఠశాల ప్రిన్సిపాల్ యంవీఎస్ఎస్.మూర్తి, పాఠశాల కోఆర్డీనేటర్ రామకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

అలరించిన గాత్ర కచేరి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): సంగీత విద్వత్సభ కాకినాడ వారి ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో సంక్రాంతి గానసభల పదిరోజుల కార్యక్రమాల్లో మంగళవారం మూడోరోజు కార్యక్రమంగా వసుధ రవి, చెన్నై వారి గాత్ర కచేరి అలరించింది. వసంత వర్ణంతో ప్రారంభించి ఆరభి రాగంలో త్యాగరాజ స్వామి వారి ఘనరాగ పంచరత్న కీర్తన సాధించెనే ఓ మనసా, అన్నమాచార్యులవారు హిందోళం రాగంలో గరుడగమన తదితర కీర్తనలు గానం చేసి ఘైమరపించారు. వయోలిన్‌పై చిన్మయి, చెన్నై, మృదంగంపై కె.సద్గురుచరణ్ విజయవాడ సహకారాన్ని అందించారు. జ్యోతుల ఐశ్వర్య జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ ఎస్‌వి.రావు, బుర్రా పద్మనాభం, వెన్నపు చక్రధరావు, ఎంవిజి కృష్ణంరాజు, నల్లమిల్లి మణిబాబు, వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.



కాకినాడలో గాత్ర కచేరి దృశ్యం

అన్న క్యాంటీన్ల పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21(ఆంధ్ర జ్యోతి): నగరంలోని రామారావుపేట, సంతమార్కెట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను మంగళవారం అదనపు కమిషనర్ కెటి సుధాకర్ పరిశీలించారు. టిఫిన్ సరఫరా ఎలా జరుగుతుంది వంటి విషయాలపై ఆరా తీశారు. భానుగుడి, ఛార్మినార్ సెంటర్, శ్రీనగర్, కొత్తపాకలు స్వర్ణాంధ్రకాలనీ ప్రాంతాల్లో పర్యటించారు.

కార్మికుల ఐక్యతే బలం : వనమాడి



ఎమ్మెల్యే వనమాడి కొండబాబును కలిసిన హెచ్ఎంఎస్ యూనియన్ ప్రతినిధులు

కాకినాడ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏ యూనియన్‌కైనా కార్మికుల ఐక్యతే బలమని, ఆ దిశగా అన్ని యూనియన్లను సమాయత్తం చేస్తున్నామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శిలు పినపోతు రాము, పినపోతు జీవరత్నం, కార్యవర్గం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా ఎమ్మెల్యే విశేష కృషి చేశారని యూనియన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల అభివృద్ధికి నూతన కార్యవర్గం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గదుల సాయిబాబు, నాయకులు తుమ్మల రమేష్, మల్లాడి గంగాధరం, సంగాడి నూకరాజు, కామాడి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో పార్కు అభివృద్ధి



పార్కులో పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ 3వ డివిజన్ సిద్ధార్థనగర్ పార్కు అభివృద్ధి పనులను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. ఈనెల 19న సిద్ధార్థనగర్ కాలనీవాసులతో ఎమ్మెల్యే పంతం నానాజీ సమావేశం నిర్వహించారు. ఏళ్ల తరబడి పార్కు అభివృద్ధికి నోచుకోలేదని, చెత్త, చెదారం, తుప్పలతో పార్కు నిరుపయోగంగా మారిందని, పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే సిద్ధార్థనగర్ కాలనీ వాసుల సౌకర్యార్థం అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు పార్కులో ఉన్న పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగింపు పనులు చేపట్టారు. మంగళవారం ఎమ్మెల్యే నానాజీ పార్కుని సందర్శించి, అభివృద్ధి పనులను సిద్ధార్థనగర్ కాలనీవాసులతో కలసి పర్యవేక్షించారు. పార్కు అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాండంగి రాజు, నల్లం శ్రీరాములు, గీసాల ఫణికుమార్,శిరంగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పాడి పరిశ్రమకు ప్రభుత్వం తోడ్పాటు'

గొల్లప్రోలు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులకు అదనపు ఆదాయం తెచ్చి పెట్టే పాడి పరిశ్రమకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొల్లప్రోలు పట్టణంలోని ఏరియా ప్రభుత్వ పశువైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, మందులను అందజేశారు. 50 పశువులకు, 200 చిన్న జీవాలకు నట్టల నివారణమందులు ఇవ్వగా, 20 పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించగా, 200 గొర్రెలకు మశూచి వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.శ్రీనివాసరావు, వైద్యాధికారులు డాక్టర్ హిమజ, డాక్టర్ ప్రశాంత్, ఎల్ఎస్ఏ పద్మావతి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ఇలాగేనా?

సీసీ రోడ్డుకు పగుళ్లు
తోస్తే పడిపోయిన కాంపౌండ్‌వాల్
అధికారుల పర్యవేక్షణ కరవు



గొల్లప్రోలు గాంధీనగర్‌లో సీసీ రోడ్డుకు పగుళ్లు వచ్చిన దృశ్యం



గొల్లప్రోలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పగుళ్లిస్తున్న సీసీ రోడ్లు, తోస్తే పడిపోయే కాంపౌండ్ వాల్ ఇది గొల్లప్రోలులో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరు. పనుల నిర్వహణలో నాణ్యతాలోపాలతో పాటు అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలకు ఇవి బలం చేకూరుస్తున్నాయి. గొల్లప్రోలు నగరపంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతపై సందేహాలు తలెత్తుతున్నాయి. నిర్మాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, నాసిరకం మెటీరియల్ వాడటం, ఎస్టిమేట్లుకు విరుద్ధంగా పనులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఇందుకుకారణంగాభావిస్తున్నారు.



తోస్తే పడిపోయిన డంపింగ్‌యార్డుకు నిర్మించిన కాంపౌండ్‌వాల్

బయటపడిన డొల్లతనం

పట్టణ శివారులో మండలపరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీ చెంతన ఉన్న డంపింగ్‌యార్డుకు కాంపౌండ్‌వాల్ నిర్మించేందుకు సీఎస్ఆర్ నిధులు రూ.7లక్షలను మంజూరు చేశారు. ఈ నిధులతో నావినేషన్ పద్ధతిపై ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపట్టారు. ఈ ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతున్న సమయంలోనే నాణ్యతపై సందేహాలు తలెత్తాయి. ఈ నిర్మాణం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిన దళిత సంఘాలు గోడ వద్ద ఆందోళన నిర్వహిస్తూ దానిని తోశారు. దీంతో మొత్తం కాంపౌండ్‌వాల్ అంతా పడిపోయి నిర్మాణంలో డొల్లతనం బయటపడింది.

అదే విధంగా గాంధీనగర్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పగుళ్లిచ్చింది, నిర్మాణ సమయంలో నాసిరకం మెటీరియల్ వాడడం, క్యూరింగ్ సరిగా చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పగుళ్లు కనపడకుండా ప్లాస్టరింగ్ చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అదే రీతిలో పట్టణంలో ఇటీవల, గతంలో జరిగిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే విమర్శలుఉన్నాయి. పట్టణ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

లాడ్జిల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో(లాడ్జీలు) తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ సూచించారు. పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో గల రాజరాజేశ్వరీభవన్‌లో మంగళవారం సాయంత్రం పట్టణంలోని లాడ్జీల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తగిన గుర్తింపు కార్డు, చిరునామా, ఇతర వివరాలు లేకుండా లాడ్జీల్లో రూమ్‌లు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. అలా కాకుండా వసతి కల్పిస్తే యజమానులతో పూర్తి బాధ్యత అని తెలిపారు. లాడ్జీల్లో ఎవరైనా అనుమానాస్పద లేదా కొత్త వ్యక్తులను గుర్తిస్తే తక్షణం పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జీలో ఉన్న వ్యక్తులు వివరాలు పూర్తిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. సమావేశంలో పట్టణ ఎస్ఐలు మణికుమార్, జానీభాషా తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో లాడ్జీల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

పిఠాపురంలో సినీనటుల సందడి

పిఠాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో సినీనటులు సందడి చేశారు. సీనియర్ నటులు సుబ్రహ్మణ్యం, కోట శంకరరావు మంగళవారం పట్టణంలో ఒక ప్రవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చారు. కుమారపురంలోని గోకులం వద్ద జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.



పిఠాపురం జనసేన ఇన్‌చార్జిని కలిసిన సినీనటులు సుబ్రహ్మణ్యం, కోటశంకరరావు

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 21(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వాహణ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, సకాలంలో చెత్త సేకరణ పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. పారిశుధ్య తనిఖీల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున నగరంలోని వెంకటనగర్ డీమార్టు, రామకృష్ణారావుపేట తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వాహణను ఆమె పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్న తీరును గమనించారు. పారిశుధ్య నిర్వహణ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

పశువైద్య శిబిరం



సామర్లకోట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సామర్లకోట మండలం వేమవరంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కిరణ్మయి, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ గంగభవాని ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు పాడి రైతులు పాడిగేదెలకు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. గ్రామంలో పాడిపశువులకు సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగి, పశువైద్యులు రాజును గ్రామస్తులు, కూటమి నాయకులు సత్కరించారు. మాగాపు పాపాయమ్మ, కామధేను చారిటబుల్‌ట్రస్ట్ గోశాల ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

పిఠాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. గోర్స రైల్వేగేటు వద్ద ట్రాక్ మధ్యలో ఛిద్రమయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు గుర్తించారు. వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటుందని, సిమ్మెంట్ కలర్ షార్ట్(టెన్నిస్ స్పోర్ట్స్), టీషర్ట్, బ్లాక్ కలర్ బనియన్ ధరించి ఉన్నట్టు తెలిపారు. వివరాలు తెలిసినవారు 9440627562కు తెలియజేయాలని సామర్లకోట జీఆర్‌పీ ఎస్ఐ వాసు కోరారు.

డ్రగ్స్‌తో బంగారు భవిష్యత్తు అంధకారం

పిఠాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలతో విద్యార్థుల బంగారు భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు సూచించారు. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కొందరు వ్యక్తులు విద్యార్థులకు మత్తు పదార్థాలను తొలుత ఉచితంగా అందజేస్తూ వారిని మత్తులోకి దించుతున్నారని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు సుందరయ్య, రామారావు, ఎండీ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కాశీవిశ్వనాథం, పల్లా సురేష్‌కుమార్, హెచ్‌సీ రాంబాబు, పోలీసులు పాల్గొన్నారు.



పిఠాపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు

డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండండి

గొల్లప్రోలు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ సూచించారు. గొల్లప్రోలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ వద్దు బ్రో కరపత్రాలను ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం పంపిణీ చేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ గంజాయి, మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల జీవితం నాశనమవుతుందన్నారు.

పిఠాపురం మండలంలో..

పిఠాపురం రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కుమారపురం, కందండ విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ నేరాలు గురించి వివరించారు. రూరల్ ఎస్ఐ గుణశేఖర్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక రుగ్మతలు దూరం

పిఠాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని పుల్లయ్యకాలువ వీధిలో నూతనంగా ఏర్పాటుచేసిన పీఠికాపుర యోగా విద్యాపీఠాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. యోగా అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వనం వీరబాబు, యోగా ట్రైనర్ సత్యప్రియ, డాక్టర్ వరలక్ష్మి, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.


జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారిణికి సత్కారం



మణిచంద్రికను సత్కరిస్తున్న దృశ్యం

కరప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారిణి బోగిరెడ్డి పావని శ్రీమణిచంద్రికను ఘనంగా సత్కరించారు. ఇటీవల నేషనల్ స్కూల్ గేమ్స్ క్రీడలకు ఖోఖో అండర్-14 విభాగం నుంచి రాష్ట్ర జట్టులో మణిచంద్రిక స్థానం సాధించిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆమె రాష్ట్ర జట్టు తరపున సత్తాచాటడంతో 1984-85 పూర్వ విద్యార్థులు సత్కరించి మెమెంటోను అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, హెచ్ఎం ఎన్.ప్రసాద్‌కుమార్, పీడీలు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, స్వర్ణరాణి, రమేష్, నక్కా బుజ్జి, సుదర్శన్‌బాబు, మంచాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విరగ బూసిన మామిడిపూత
పొగమంచుతో రైతుల దిగాలు



కొత్తపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈఏడాది మామిడి పూత విరగబూయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా మామిడి చెట్లకు ఆకులు కనిపించకుండా పూతలు కనిపిస్తోంది.. రైతులు పూత నిలబడేందుకు వివిధ రకాల మందులను స్ప్రే చేస్తున్నారు. రాత్రి సమయంలో మంచు, తెల్లవారుజామున కురుస్తున్న పొగ మంచుతో పూత మాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



చేబ్రోలులో కలుసుకున్న 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలురూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాల తర్వాత కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఒకేచోట చేరి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. శాంతిఆశ్రమంలోని శాంతి ఎయిడెడ్ హైస్కూలు 1999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు మంగళవారం చేబ్రోలులోని కోకోఫామ్స్‌లో అపూర్వ కలయిక ఏర్పాటు చేసుకున్నారు. వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. కుటుంబసభ్యులు గురించి తెలుసుకుని, తరగతి గదుల్లో చేసిన అల్లరిని గుర్తుకు తెచ్చుకున్నారు. 25ఏళ్ల తర్వాత కలుసుకున్న సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. శాంతిఆశ్రమం ఓంకార్ స్వామీజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ప్రతి ఏటా కలవాలని నిర్ణయించుకున్నారు.

దిశ కమిటీ మెంబర్‌గా గొడ్డటిపాలెం సర్పంచ్



ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గొడ్డటిపాలెం సర్పంచ్ అనూష దంపతులు

కరప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) మెంబర్‌గా గొడ్డటిపాలెం గ్రామ సర్పంచ్ గోన అనూష ఆంజనేయులు నియమితులయ్యారు. ఈసందర్భంగా సర్పంచ్ దంపతులు దిశ కమిటీ ఛైర్మన్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అధికారులతో చర్చించి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధిపై దృష్టిసారిస్తామని సర్పంచ్ అనూష దంపతులు తెలిపారు. అనంతరం కాకినాడ వివేకానందహాల్‌లో జరిగిన దిశ కమిటీ సమావేశానికి వారు హాజరయ్యారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బిరుదా బాబు, అంజి, టీడీపీ నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాస్

కొత్తపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా కొత్తపల్లి మండలం కొండెవరానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం కాకినాడలో జరిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎన్నికలో శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను ప్రధానకార్యదర్శి దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, ఓలేటి వెంకటేశ్వరరావు, బుర్రే మురళీధరరావు, రవణం సుబ్రహ్మణ్యం, కొమ్మిరెడ్డి వీరభద్రరావు సత్కరించారు.



బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

పనిచేసే కార్యకర్తలకు బీజేపీలో గుర్తింపు

పిఠాపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీలో పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన వాసంశెట్టి శ్రీనివాస్‌ను మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ, మండలశాఖల అధ్యక్షులు ఓలేటి వెంకటేశ్వరరావు, చిట్టా మధు, దువ్వ గంగాధర్, కర్రి సింహాద్రి అప్పన్న, బుర్రి మురళీధరరావు, పసుపులేటి సత్యనారాయణ, తోట ఏడుకొండలు, కర్నీడి తాతీలు, రవణం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీఓఐసీసీ రాష్ట్ర డయాసిస్ బిషప్‌గా రాజ్‌కుమార్

కరప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కమ్యూనియన్ ఆఫ్ ఇంటర్నేషనల్ కేథలిక్ కమ్యూనిటీస్ (సీఓఐసీసీ) ఆంధ్రప్రదేశ్ డయాసిస్‌కు బిషప్‌గా నడకుదురు క్రైస్ట్ బిలీవర్స్ చర్చ్ ఫాదర్ రెవరెండ్ మేడపాటి రాజ్‌కుమార్ నియమితులయ్యారు. నడకుదురులోని ఒక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సీఓఐసీసీ ఆర్చ్ బిషప్ టడ్ బెల్ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్ నియామకం జరిగింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరప, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొబ్బరిచెట్టుపై నుంచి జారిపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కరప పోలీసులు తెలిపారు. నడకుదురుకు చెందిన మాకిరెడ్డి దుర్గాప్రసాద్(23) కాకినాడ పోర్టులో కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 10వ తేదీ రాత్రి నడకుదురులోని ఒక ఫంక్షన్‌హాల్ వెనుకనున్న ఖాళీ స్థలంలో స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. అనంతరం మిత్రుడు అశోక్‌కుమార్‌తో కలిసి కొద్దిసేపు చలిమంట కాగి పక్కనే ఉన్న కొబ్బరిచెట్టు ఎక్కాడు. రెండు కొబ్బరిబొండాలు కోసి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి జారిపడ్డాడు. అపస్మారకస్థితికి చేరిన దుర్గాప్రసాద్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు

సామర్లకోట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ కుళాయికి హెడ్‌లేక పోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. అయినా అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తనట్టు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట పట్టణం బ్రౌన్‌పేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్క్ వెనుక భాగంలో కమ్యూనిటీ హాలు ప్రహరీకి పబ్లిక్ కుళాయి ఏర్పాటుచేశారు. ఇటీవల మంచినీరు సరఫరా జరిగే కుళాయి హెడ్ లేకపోవడంతో తాగునీరు వృథాగాపోతోంది. దీంతో ప్రజలు టాప్‌లేని కుళాయిలో కర్రముక్కలు పెడుతూ నీటిని నిలుపుదల చేస్తున్నారు. తాగునీటి వృథా కాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్షతగాత్రులకు రూ.5లక్షలు సహాయం



బాధితులకు రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్

సర్పవరం జంక్షన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వైద్య ఖర్చుల కోసం రూ.5లక్షల చెక్కును కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ అందించారు. ఈనెల16న విహారయాత్ర కోసం దారపల్లి జలపాతానికి కాకినాడ రూరల్ మండలం నుంచి ట్రావెల్ వ్యాన్‌లో వెళుతోండగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఒమ్మంగి సమీపంలో గోపాలచెరువు వద్ద వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టి, పంట కాలువలో బోల్తా ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 29మంది తీవ్ర గాయాలతో మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను ఎమ్మెల్యే పంతం నానాజీ పరామర్శించి, మెరుగైన వైద్యం కోసం రూ.5లక్షలు ఇస్తానని ప్రకటించారు. మంగళవారం ఎమ్మెల్యే కుమారుడు సందీప్ మెడికవర్ ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న 29మంది బాధితులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే హామీ మేరకు పంతం ఫౌండేషన్ ద్వారా రూ.5లక్షల చెక్కును బాధితులకు అందజేశారు. పూర్తి ఆరోగ్యంగా కోలుకోవాలని, బాధితులకు అన్నివిధాలా ఎమ్మెల్యే అండగా ఉంటారని, భవిష్యత్తులో ఏఅవసరం వచ్చినా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు, ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు కృషితో స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,440కోట్లు



మాట్లాడుతున్న టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి

సర్పవరం జంక్షన్, జనవరి21(ఆంధ్రజ్యోతి): నష్టాల్లో ఉండి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విశేష కృషి చేసిందని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి అన్నారు. మంగళవారం వలసపాకల నివాసం, కరణంగారి సెంటర్‌లో టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ)లు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ సీఎం కృషి ఫలితంగా కేంద్రం స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి రూ.11,440కోట్లు సాయం ప్రకటించిందన్నారు. ఉత్తరాంధ్రతో పాటూ యావత్ ఆంధ్రరాష్ట్రానికి మణిహారం విశాఖ ఉక్కు కర్మాగారమన్నారు. అనేక వేల మంది పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను పునరుజ్జీవించడానికి కేంద్రం అందించిన సహాయం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కేసుల నుంచి కాపాడంటూ నాటి సీఎం జగన్ కేంద్రం వద్దకు వెళ్లి మోకరిల్లేవారని, నేడు చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి కోట్లాది నిధులు రాష్ట్రానికి మంజూరు చేయించుకుని వస్తున్నారన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరంచేయాలని, ఉక్కు ఆస్తులను అమ్ముకోవాలని జగన్ ప్రయత్నించారని ఆరోపించారు.

34 రేషన్ డీలర్ల పోస్టులకు 307 దరఖాస్తులు

రేపు పరీక్ష

రంపచోడవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం డివిజన్ పరిధిలోని రేషన్ దుకాణాల్లో ఖాళీగా ఉన్న 34 డీలర్ల పోస్టులకు 307 దరఖాస్తులు అందాయని సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లను సమీప తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 23లోగా పొందవచ్చన్నారు. రంపచోడవరం ఇంజనీరింగ్, బీఈడీ కళాశాలలో 24వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. వివరాలకు 08864-243561ను సంప్రదించాలని సూచించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



భోజనం వడ్డిస్తున్న తుమ్మలపల్లి రమేష్

అన్నదానం

జగ్గంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం తుమ్మలపల్లి సత్యనారాయణ భావతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. రమేష్ స్వయంగా హాజరై 500 మందికి భోజనాలు వడ్డించారు. రాజాల శ్రీను, సూరపరెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, కాకి లేటి బాబ్జీ, అంకం ఓం, గండం శ్రీనివాస్, సత్తి సోమరాజు, తుమ్మల పణీంద్ర, తుమ్మల మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): వీసీసీ ఆధ్వర్యంలో వైఎస్ పర్యటన పాలన ఏడాది పూర్తయింది. మంగళవారం కళా మందిర్ సెంటర్ వద్ద వీసీసీ సభ్యుడు దర్శాలకోట శ్రీను కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

11ఏళ్ల తర్వాత డాక్టరొచ్చారు

ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిగా మహ్మద్ రఫీ నియామకం



మోతుగూడెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలోని ఆయుర్వేద వైద్యశాలకు 11ఏళ్ల తర్వాత ప్రభుత్వం ఎట్టకేలకు వైద్యాధికారిని నియమించింది. 'మూతపడిన ఆయుర్వేద ఆసుపత్రి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కర్నూలుకు చెందిన మహ్మద్ రఫీని వైద్యాధికారిగా నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి 11ఏళ్లుగా మూతపడి ఉండడంతో లోపల ఉన్న మందులు పూర్తిగా పాడైపోయాయన్నారు. భవనానికి రంగులు వేసి విద్యుత్ సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

వచ్చే నెల 9న ఆదిమ తెగల సాంస్కృతిక సమ్మేళనం

దేవీపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో వచ్చే నెల 9న జరిగే ఆదిమ తెగల సాంస్కృతిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. ఇందుకూరుపేట ఆదివాసీ భవనం స్థలంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు కళాకారులతో ర్యాలీ ప్రారంభమవుతుందని అనంతరం సభ జరుగుతుందన్నారు. ఆదివాసీ నాయకులు యల గాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, ఎంపీటీసీ తుర్రం జగదీష్‌దొర, పమ్మకూరి సాయి, బందారు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ కట్టడాలను నిలిపివేయాలి'



సబ్ కలెక్టర్ కల్పశ్రీకి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

రంపచోడవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని అక్రమ కట్టడాలను తక్షణం నిలిపివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఐటీడీఏ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలో రోజురోజుకూ పెరుగుతున్న అక్రమ కట్టడాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అడ్డతీగల మండలం డి.భీమవరం, దుప్పులపాలెం గ్రామాల్లో గత కొన్ని నెలలుగా గిరిజనేతరులు అక్రమంగా నిర్మిస్తున్న వాటిని నిలుపుదల చేసి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికి అనేకమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ గిరిజన చట్టాలను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. డివిజన్ అధ్యక్షుడు మోడెం నూకరాజు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దారు సుబ్బారావు

మండల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

ఎటపాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే క్రీడోత్సవాలను సబ్బంపాడు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తహసీల్దారు కారం సుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ఆటల పోటీలకు శ్రీకారం చుట్టారు. తొలి రోజు వాలీబాల్, షాట్‌పుట్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించగా మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

గానాల రామమూర్తి జయంతి

కిర్లంపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గానాల రామమూర్తి 139వ జయంతి నిర్వహించారు. కిర్లంపూడి మండల విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గానుగుల శ్రీనివాసరావు, కొత్తల వీర్రప్రసాద్ ఆధ్వర్యంలో రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రేలి వీరబ్రహ్మం, మండల సభ్యులు అక్కోజు శివరామకృష్ణ, పెదగాడి లవరాజు, కొండెంపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టాలు పంపిణీ

దేవీపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట తహసీల్దారు కార్యాలయంలో బుధవారం తాత్కాలిక గ్రామ పోలవరం నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేస్తామని తహసీల్దారు కె.సత్యనారాయణ తెలిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, సబ్ కలెక్టర్ కల్పశ్రీ హాజరవుతారన్నారు.

ఎంపీడీవోగా రామాంజనేయ ప్రసాద్



కూనవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూనవరం ఎంపీడీవోగా రామాంజనేయ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన కూనవరం ఈవోపీఆర్డీగా పని చేశారు. తాజాగా ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా నియమితులయ్యారు.

ధర లేదు... దిగుబడీ లేదు...!

ఘాటు తగ్గిన ఎండుమిర్చి

నష్టాలు వస్తున్నాయంటున్న రైతులు



యర్రంపాలెంలో కల్లాల్లో ఆరబెట్టిన ఎండుమిర్చి

గండేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నోట్లో పెట్టకుండే కన్నీళ్లు రప్పించే ఎండుమిర్చి దిగుబడి, గిట్టుబాటు ధర లేక రైతుల కళ్లలో నీళ్లు తెప్పిస్తోంది. గత రెండు సంవత్సరాలుగా లాభాలు తెచ్చిపెట్టిన ఈ పంట ఈ సంవత్సరం నష్టాలు చేకూర్చింది. మిర్చి మొక్కలు నాటిన సమయంలో వర్షాలు అధికంగా కురవడంతో నీట మునిగి మొక్కలు గిడసబారిపోయి కాయలు ఏడుగుడం లేదని రైతులు చెప్తున్నారు. ఎండుమిర్చి ప్రస్తుతం క్వింటాలు రూ.15వేలు నుంచి రూ.17వేలు పలుకుతోందని, కనీసం రూ.30వేలు పైన ఉంటేనే కానీ గిట్టుబాటు కాదంటున్నారు. ఎకరానికి 50-55 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 20-25 క్వింటాళ్ళు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.25లక్షల వరకు పెట్టుబడి అయ్యిందని... ధర, దిగుబడి లేక ఈ సంవత్సరం నష్టాలు తప్పేలా లేవంటున్నారు. గండేపల్లి మండలంలో సుమారు 5,550ఎ పైగా... ఒక యర్రంపాలెం గ్రామంలోనే 300 ఎకరాల్లో రైతులు ఈ పంట సాగుచేస్తున్నారు. కాగా వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యత లేదంటూ ధరలు తగ్గించేస్తున్నారని పలువురు రైతులు చెప్తున్నారు. అదే కాయలను బయట రూ.250 వరకు విక్రయించి లాభాలు పొందుతున్నారన్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు.

క్వింటాలు రూ.30వేలు ఉంటేనే గిట్టుబాటు

బిక్కిన భాస్కరరావు, రైతు, యర్రంపాలెం



క్వింటాలు ధర రూ.30వేలు ఉంటేనే రైతుకి గిట్టుబాటు అవుతుంది. ఈ సంవత్సరం దిగుబడి, ధర లేవు. నష్టాలు చవిచూడాల్సిందే. మొక్క నాటిన దగ్గర నుంచి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్న శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరులా మారింది. ప్రభుత్వం సాయం చేస్తేనే రైతులకు మేలు కలుగుతుంది.

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడమే లక్ష్యం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడమే టీడీపీ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభారాణి చెప్పారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 'విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు' నినాదంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా టీడీపీ గత కొన్నేళ్లుగా పోరాడుతోందన్నారు. సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే దాని ఆస్తులను అమ్ముకోవాలని జగన్ చూశారన్నారు. ఐదేళ్ల పదవీ కాలంలో ఆయన ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ తన కేసుల మాఫీ గురించి మాట్లాడడమే తప్ప రాష్ట్ర అభివృద్ధికి ఒక్క పైసా తీసుకురాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎన్నో విజయాలు సాధించిందన్నారు. కేంద్రం నుంచి ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో నిధులు రాబడుతూ ఎన్డీయే కూటమి రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెట్టేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి నాయకుల కృషి ఫలితంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం శుభపరిణామమని ఎమ్మెల్యే తెలిపారు. విశాఖ ఉక్కు సంక్షోభం నుంచి బయటపడేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఇతర కూటమి నాయకులకు నియోజకవర్గ ప్రజల తరఫున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి శ్రీధర్

రహదారి భద్రతపై అవగాహన

గండేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా రవాణా శాఖాధికారి కె.శ్రీధర్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఎంవీలు కె.ప్రసాద్, హరనాథరెడ్డి, కళాజ్యోతి, జగ్గంపేట సీఐ వైజర్ల శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు, మెడికవర్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ప్రకాష్ హాజరయ్యారు. ఆర్టీవో శ్రీధర్ మాట్లాడుతూ బస్సుల ఫిట్‌నెస్ క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నామన్నారు. బస్సులు నడిపేటప్పుడు డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఉండకూడదని, వారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సదస్సులో డైరెక్టర్ (మేనేజ్‌మెంట్) ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, డైరెక్టర్ (అకడమిక్స్) డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరేష్, డీన్ (ఆర్ అండ్ డీ) డాక్టర్ పి.మాధురాజు, ఎం.రాధికామణి, వై.జయబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ధర్మరాజు



ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద శంకర్లపూడి గ్రామానికి చెందిన కర్రి ధర్మరాజు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కాకినాడలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందూ ధర్మ రక్షా సమితి రాష్ట్ర నాయకుడైన ధర్మరాజు బీజేపీలో విశ్రాంత సైనిక ఉద్యోగుల విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ధర్మరాజుకు బీజేపీ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, ఊటా వీరబాబు, గున్నాబత్తుల రాజబాబు, కందా వీరాస్వామి, రామకుర్తి సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.



బీమా కార్డులు అందిస్తున్న జనసేన రాష్ట్ర నేత సూర్యకిరణ్

జర్నలిస్టులకు బీమా కార్డుల అందజేత

శంఖవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ) అన్నారు. జర్నలిస్టులకు రూ.15లక్షల బీమా కార్డులను మంగళవారం ఆయన కత్తిపూడిలో అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కేతంగి హరినాథ్, గౌరవాధ్యక్షుడు జక్కుల నాగసత్యనారాయణ, రేలంగి దొరబాబు, దాసరి శ్రీను, గునపర్తి అప్పలరాజు, యండమూరి బాబి, నెల్లిపూడి కృష్ణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

ప్రత్తిపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న బందం చిన్నారావుకు టీడీపీ జిల్లా నాయకుడు రెడ్డి అమ్మాద్ మంగళవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట టీడీపీ యువ నాయకుడు లాండా వెంకటేష్ ఉన్నారు.

20లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

తుని రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ కాలనీలో సారా విక్రయ స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. కాలనీలో సారా అమ్ముతున్న వ్యక్తిని గుర్తించి అతడి నుంచి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌వో బొదిరి మాట్లాడుతూ మద్యం అక్రమ అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

పశు వైద్య శిబిరాలు

జగ్గంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పశు వైద్యశాలలో పశువైద్యాధికారి కె. తాతయ్య ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎర్నిన్ అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యులు పశువులను పరిశీలించి మందులు అందజేశారు. జంపనీర్ సత్తి నరాకపరెడ్డి, కరుమళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మురారిలో పశువైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ జాస్తి వసంత్, మాజీ సర్పంచ్ దుంగల బుల్లిరాజు ప్రారంభించారు. 350 గొర్రెలు, మేకలకు, 103 లేగదూడలకు, 139 ఆవులు, పాడి గేదెలకు పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 15 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు.



జ్యోతిప్రజ్వలనతో నామ సంకీర్తన యజ్ఞాన్ని ప్రారంభిస్తున్న భాస్కరప్రసాద్

'దైవస్మరణకు మించిన ఆధ్యాత్మిక సాధన మరొకటి లేదు'

కిర్లంపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పూర్వజన్మల కర్మ ఫలితాలను నశింపచేయాలంటే కలియుగంలో దైవనామస్మరణకు మించిన ఆధ్యాత్మిక సాధన మరొకటిలేదని, ఎవరికి నచ్చిన దేవుని నామాన్ని వారు నిరంతరం స్మరించడం అలవాటు చేసుకోవాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త కమ్మరి భాస్కరప్రసాద్ పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి శత జయంత్యుత్సవాల సందర్భంగా మండలంలోని వీరవరంలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 100 గంటలు (ఐదు రోజులు) నామ సంకీర్తన మహా యజ్ఞం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరావు హాజరై మాట్లాడారు. అనంతరం నిరాటంకంగా భజనలు జరగడానికి కృషి చేసిన నిర్వాహకులు తోట అప్పలస్వామి, వీరవేణి, పాపారాయుడు, రాజ్యలక్ష్మిలను మనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అక్కిరాజు శ్రీనివాస్, నిడదవోలు సూరిబాబు, కె.రాధిక, తోట రాజ్యలక్ష్మి, పాపారాయుడు, పాలచర్ల శ్రీనివాస్, తుమ్మలపల్లి చిట్టి కామేశ్వరి, పి.నాగేశ్వరరావు, కె.రాజేశ్వరి, ఒబిలిశెట్టి లక్ష్మీనారాయణ, తుమ్మలపల్లి జోగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలకు 'యనమల' దిశా నిర్దేశం



సమావేశంలో పాల్గొన్న బూత్ కమిటీ సభ్యులు

తుని రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి తుని నుంచి భారీ మెజార్టీ చేకూర్చేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు బూత్ కమిటీలకు సూచించారు. తేటగుంటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన బూత్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. పట్టభద్రులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా బూత్ కమిటీలు కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం యువతకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేసి మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, తుని పట్టణ శాఖ అధ్యక్షుడు ముస్లిపల్ మాజీ చైర్మన్ యినుగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, ఎస్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), గాడి రాజబాబు, మల్ల గణేష్, యనమల లక్ష్మణరావు, పోలిశెట్టి రాములింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావును అభినందిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందన

ఏలేశ్వరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన బిక్కిన విశ్వేశ్వరరావుకు పలువురు అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయనను జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, రాతికింద కృష్ణారావు, మలిరెడ్డి పాపారావు, పులపర్తి శ్రీను, నాయకులు కలిసి శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు విశ్వేశ్వరరావు సూచించారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

ఏలేశ్వరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో సర్పంచ్ వీరంరెడ్డి నాగేశ్వరరావు, యర్రవరం సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు నేతృత్వంలో మంగళవారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'పై ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. తడి, పొడి చెత్త డబ్బాలను ఎంపీపీ బుజ్జి పంపిణీ చేశారు. ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంపీటీసీ యజ్ఞనరిగి ప్రసాద్, బూర్లు బోసు, బస్సా ప్రసాద్, మైరాల కనకరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఈ-పంట' నమోదు చేసుకోవాలి

గండేపల్లి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గోపాలపురం, ఉప్పలపాడు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తి మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాళ్వా పంట వేసిన ప్రతి ఒక్కరూ ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఏఈవో చంద్రమౌళి, వీహెచ్ఏ ఆలీషా, వీహెచ్ఏ సుధ, రైతులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన పలువురికి జరిమానా

జగ్గంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జగ్గంపేట సర్కిల్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి 28మందిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ జరిమానా విధించారని సీఐ వైజర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఐదుగురికి రూ.50వేలు, ఒకరికి నాలుగు రోజులు జైలు శిక్ష, ముగ్గురికి మూడు రోజులు జైలు శిక్ష, నలుగురికి రెండు రోజులు జైలు శిక్ష విధించారన్నారు. బహిరంగ ప్రదేశంలో తాగుతున్న పది మందికి ఒక్కొక్కరికి రూ.800 చొప్పున ఫైన్ వేశారు.